క్లుప్తంగా

ఎమ్మెల్యే పీఏ నియామకం



శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఉంగటి సత్యనారాయణ శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ వ్యక్తిగత సహాయకుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే సమాచారం నిమిత్తం 89196 79968 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పరిపాలన భవనం పూర్తి



పూర్తైన పరిపాలన భవనం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పరిపాలన భవనం నిర్మాణం పూర్తయ్యింది. రూ.35 కోట్లతో ఈ భవనం నిర్మించారు. కేంద్ర ప్రజా పనులు శాఖ ఈ నిర్మాణం చేపట్టింది. త్వరలో ఈ భవనం ప్రారంభానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. పాలనాపరమైన అన్ని విభాగాలను ఈ భవనంలోకి త్వరలో మార్పు చేయనున్నారు. పాలనాపరంగా వసతి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కానుంది.

ఆన్‌లైన్‌లోనే పీఏసీఎస్ సేవలు

రణస్థలం: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకింగ్ సేవలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లోనే జరుగునని పైడి భీమవరం పీఏసీఎస్ సీఈవో గిరిబుచ్చి రంగనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాలైన రుణాలు తీసుకున్నవారు తక్కువ ఉంటే క్లియర్ చేసుకోవాలని, ఎక్కువగా ఉంటే రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఎంత రుణం ఉందో కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. కార్డు లేని వారు బ్యాంకుకు వచ్చి కిసాన్ క్రెడిట్ కార్డు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు పీఏసీఎస్ బ్యాంకును సంప్రదించాలని కోరారు.

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కూటమి నాయకులు

రణస్థలం: మండలంలోని చిల్లపేట రాజాం గ్రామానికి చెందిన కొణతాల శ్యామలరావు ఇటీవల విజయనగరం వసతి గృహంలో చదువుతూ అస్వస్థతకు గురై మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబాన్ని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావులు సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దీనిపై ఎంపీ అప్పలనాయుడు విజయనగరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి బాధిత కుటుంబానికి తగిన సాయం చేయాలని సూచించారు. మృతికి గల కారణాలను అదే గ్రామానికి చెందిన మరో విద్యార్థిని అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు కూటమి నాయకులు ఉన్నారు.

వేగవంతంగా పనులు పూర్తి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీడీ సుధాకరరావు

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్యం సంస్థ పీడీ టి.సుధాకరరావు సిబ్బందికి ఆదేశించారు. లావేరు మండలం బుడుమూరు గ్రామంలో జరుగుతున్న సిమెంట్ రహదారి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రూ.238.6 కోట్ల నిధులతో సిమెంట్ రహదారుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపాధి హామీ పథకం నిధులు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. నిబంధనల మేరకు పనులు చేపడుతూ నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. ఆయనతో పాటు ఈసీ లెనిన్‌బాబు, ఇతర ఉపాధి సిబ్బంది, పీఆర్ ఇంజినీర్ విభాగం సిబ్బంది ఉన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి



నిర్మాణం పూర్తయిన సిమెంట్ రోడ్డు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాల నుంచి మహిళా ప్రాంగణం వరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. ఈ రోడ్డు గతంతో అసంపూర్తిగా ఉండిపోవడంతో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు మంజూరు చేసి నిర్మించారు.

క్రీడల్..!

- మూలకుచేరిన క్రీడా పరికరాలు
- పట్టించుకోని అధికారులు



విరిగిపోయిన వ్యాయామ పరికరాలు



యువత ఏర్పాటు చేసుకున్న వాలీబాల్ కోర్టు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పాత్రునివలస గ్రామ సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన టిడ్కో కాలనీలో సుమారు 700 కుటుంబాలు ప్రస్తుతం నివాసం ఉంటున్నాయి. అయితే కాలనీ ఏర్పాటు చేసే సమయంలో అక్కడి ప్రజల కోసం మున్సిపాలిటీ అందించిన వ్యాయామ పరికరాలు తప్పుపట్టాయి. అప్పట్లో ఆ పరికరాలు ఏర్పాటు చేసిన స్థలంలో పిచ్చి మొక్కలు పెరగడంతో ఉపయోగించే అవకాశం లేకుండా పోతోంది. ఏర్పాటు చేసిన పరికరాల్లో ట్రిపుల్ స్టాండ్ ట్విస్టర్, సిట్టింగ్ ట్విస్టర్, ఫోర్‌వీల్ థాయ్ షైస్పిన్నర్, సీటెడ్ పుల్లర్లు పూర్తిగా విరిగిపోయి ఎక్కడి పార్టులు అక్కడే పడి ఉన్నాయి. వీటితో పాటు చెస్ట్‌ప్రెస్ డబుల్, హార్స్ రైడర్, డబుల్ ఎయిర్ వాకర్లు నేలమట్టమయ్యాయి. ఇప్పటికే 70 మంది యువత కలిసి ఏకదంత టిడ్కో యూత్ పేరుతో రిజిస్టర్ చేయించుకోవడం జరిగింది. వీరంతా ప్రాక్టీసు కోసం తలోపైసా వేసుకొని వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేసుకున్నారు. అందువలన వ్యాయామ పరికరాలు సైతం అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను కోరుతున్నారు.

బాగు చేయాలి



టిడ్కో కాలనీలో 70 మంది కుర్రోళ్లం ఉన్నాం. తలోపైసా వేసుకొని వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేసుకున్నాం. కానీ మున్సిపల్ యంత్రాంగం ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు మాత్రం నేలమట్టమయ్యాయి. వీటిని బాగు చేయాలంటే ఖర్చుతో కూడుకున్నది. వీటిని మున్సిపల్ యంత్రాంగం త్వరితగతిన బాగు చేయాలి.

– తరుణ్, టిడ్కో కాలనీ, పాత్రునివలస

గ్రౌండ్‌కు కేటాయించాలి



టిడ్కో కాలనీల్లో చాలా మంది యువకులం ఉన్నాం. ఒక్క వాలీబాల్ కోర్టుతోనే కాకుండా, పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని బాగుచేసి ఇస్తే మరిన్ని క్రీడలు ఆడుకుంటాం. దీనివలన మాకు చాలా మేలు జరుగుతుంది.

– జి.కార్తీక్, టిడ్కో కాలనీ

విజిట్ చేస్తాం

పాత్రునివలస పరిధిలోని టిడ్కో కాలనీని విజిట్ చేస్తాం. స్థానికంగా ఉన్న సమస్యలను చూసి పరిష్కరిస్తాం. యువత కోరిక మేరకు మూలకు చేరిన పరికరాలన్నింటినీ బాగుచేసి అందిస్తాం.

– పీవీవీడీ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, శ్రీకాకుళం

మరింత విస్తృతంగా 'అన్నపూర్ణ' సేవలు



సమావేశంలో పాల్గొన్న సంఘ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : రిమ్స్‌లోని సత్యసాయి అన్నపూర్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో రోగులు, సహాయకులకు నిత్యం స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్నామని, ఆ సేవలను మరింత విస్తృతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు కోరారు. మంగళవారం రిమ్స్‌లో అన్నపూర్ణ సేవా సంఘం వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12ఏళ్లుగా రిమ్స్‌లో సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాలను కూడా పూలమొక్కలతో మరింత ఆహ్లాదకరంగా దీర్చిదిద్దాలని కోరారు. సంఘం ఆధ్వర్యంలో హిరమండలంలో 'ప్రేమసాయి వృద్ధాశ్రమం', సాయిగణేష్ మందిరంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం, చిట్టిపూడివలసలో నిత్య నారాయణసేవలు అందిస్తున్నట్లు వివరించారు. త్వరలో పాతబస్టాండ్ వద్ద నిత్య నారాయణ సేవను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, రిమ్స్ అన్నపూర్ణ ట్రస్ట్ అధ్యక్షుడు గంగుల రమణబాబు, సెక్రటరీ కిల్లాన ఫల్గుణరావు, జాయింట్ సెక్రటరీ పప్పల నాగేశ్వరరావు, బోయిన నరసింహమూర్తి, కృష్ణారావు, లోలుగు నూకరాజు, లోకనాథం రామారావు, కరకవల ప్రహ్లాదరావు, రైస్ ఇన్‌చార్జి వెంకటరమణ, పొందూరు సూర్యారావు, సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణ కిరీటానికి వితరణ



అర్చకునికి బంగారం అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో భూ వేంకటేశ్వర దేవాలయంలో స్వామివారికి బంగారు కిరీటం చేయించే నిమిత్తం శ్రీనివాస్, సత్యజయ దంపతులు తమవంతు బంగారాన్ని విరాళంగా ప్రకటించారు. నాలుగు గ్రాముల బంగారాన్ని మంగళవారం ఆలయ అర్చకులు గోపాలాచార్యులుకు అందజేశారు.

విజయవంతం చేయండి

ఎచ్చెర్ల: ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను లావేరు శాఖా గ్రంథాలయంలో నిర్వహించనున్నామని, ప్రతీ విద్యార్థి వారోత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వారోత్సవాలకు సంబంధించి ప్రత్యేక పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.

గ్రామ సభలతో భూ సమస్యల పరిష్కారం



రైతుల సమస్యలను తెలుసుకుంటున్న డీటీ గాయత్రి

జి.సిగడాం: భూ రీసర్వేలో తప్పులుంటే గ్రామ సభల ద్వారా పరిష్కారమవుతాయని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కె.గాయత్రి సూచించారు. మండలంలోని జాడ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. రీసర్వే పూర్తైన గ్రామాల్లో రైతుల పడుతున్న ఇబ్బందులపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోకమహేశ్వరరావు, ఎంపీటీసీ పెద్ది శ్రీనివాసరావు, ఎం.చిరంజీవి, ఆర్ఐ రాధ, సర్వేయర్ మెట్ట శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెరువు గట్టు..
వ్యాపారమే అసలు గుట్టు!



చెరువు చుట్టూ చదును చేసిన దృశ్యం (ఇన్‌సెట్లో) నేతల ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు

- రోడ్డులా చదును చేసిన టీడీపీ కార్యకర్త
- డీ పట్టా భూమిలో వ్యాపారం కోసమేనంటున్న స్థానికులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : మండల పరిధిలోని వాకలవలస గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 17లో సుమారు 25 సెంట్ల చెరువుగర్భంలోని డీపట్టా భూమిలో వ్యాపారానికి స్థానిక టీడీపీ కార్యకర్త స్కెచ్ వేశారని స్థానికులు చెబుతున్నారు. ఒకప్పుడు ఈ భూమిలోకి వెళ్లాలంటే నడిచేందుకు వీలుగా చిన్నపాటి గట్టు మాత్రమే ఉండేది. ఈ తరుణంలో సదరు కార్యకర్త తనకున్న డీ పట్టా భూమిలో నందలు(పైపులు) వ్యాపారం కోసం భారీ స్కెచ్ వేశాడు. ఈ చెరువు గట్టునే చదును చేసి వెడల్పు చేసి అడ్డుగా ఉన్న చెట్లను సైతం తొలగించాడు. ట్రాక్టర్, లారీలతో సైతం మెటీరియల్ తెచ్చుకునేందుకు మరింత వెడల్పు చేసి చెరువు చుట్టూ చదును చేసి రోడ్డు మాదిరిగా వెడల్పు చేసేశాడు. చెరువులో కార్తీక మాస భక్తులు స్నానానికి వస్తున్నందున ఏ ఒక్కరూ బహిర్భూమికి వెళ్లకూడదంటూ ఫ్లెక్సీలను సైతం గట్టు అంతటా ఏర్పాటు చేయడం గమనార్హం. పనిలో పనిగా అధికార టీడీపీ నేతల ఫొటోలతో కూడిన ఓ ఫ్లెక్సీను సైతం రోడ్డు ముఖద్వారంలో ఏర్పాటు చేశాడు.

పరిశీలిస్తాం..

ప్రభుత్వ భూములు, చెరువులు ఎవరైనా కబ్జాలకు పాల్పడినా, వాటిలో రహదారులు ఏర్పాటు చేసిన కఠిన చర్యలు తప్పవు. వాకలవలస పంచాయతీ పరిధిలో జరుగుతున్న భూ కబ్జాలపై రెవెన్యూ సిబ్బందితో సర్వేచేసి స్వాధీనం చేసుకుంటాం.

– గణపతిరావు, శ్రీకాకుళం రూరల్ తహసీల్దార్

పొంచి ఉన్న ప్రమాదం



రణస్థలం మండలంలోని రణస్థలం పంచాయతీలో ఉన్న నగరపాలేం రైతుల పొలాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో రైతులు వ్యవసాయం చేయాలంటే బిక్కుబిక్కుమంటున్నారు. ఇటీవల విద్యుత్ తీగలు కిందికి వేలాడడంతో చెరుకు పంటకు మంటలు వ్యాపించి ఎకరా పంట కాలిపోయింది. అందువలన విద్యుత్ అధికారులు స్పందించి వైర్లు సరిచేయాలని కోరుతున్నారు.

– రణస్థలం

వృథాగా గోదాం



ఎచ్చెర్ల మండల కేంద్రంలో పౌర సరఫరాల శాఖ నమూనా గోదాంను నిర్మించింది. అయితే ఈ గోదాం వినియోగంలోకి తీసుకు రాకుండా విడిచిపెట్టేశారు. ప్రస్తుతం రూ.లక్షల్లో ఖర్చు చేసిన గోదాం ఎటువంటి అవసరాలకు వినియోగించడం లేదు. అవసరం లేదనుకుంటే గోదాం తొలగించడం లేదు. ప్రభుత్వ ధనం వృథాగా పోతుంది అనడానికి ఒక ఉదాహరణ ఈ గోదాం.

– ఎచ్చెర్ల క్యాంపస్

నరకయాతన



శ్రీకాకుళం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే పరంకుశనగర్ రహదారి అధ్వానంగా మారింది. ఈ రోడ్డు మరమ్మతుల నిమిత్తం నెల రోజుల క్రితం ఇసుక, కాంక్రీటు పిక్క రోడ్డు చుట్టుపక్కలా పడేశారు. కానీ పనులు మాత్రం చేయడం లేదు. దీంతో రోడ్డు మీద దుమ్ము, ధూళి ఎక్కువై రాకపోకలు చేసేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

– శ్రీకాకుళం రూరల్

అపరాలపై ఆశలు



మెట్ట ప్రాంతాల్లో సాగు చేస్తున్న అపరాల (మినుము, పెసర) పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం వాతావరణం అనుకూలించింది. ఈ పంట బాగా పండితే ఎకరాకు 5 నుంచి 8 బస్తాల దిగుబడి వస్తాయి. రైతుకు కష్టాలు తీరుతాయి. మండలంలోని మర్రివలస–నాగులవలస గ్రామాల మధ్యలో రైతులు అపరాలు అధికంగా పండించారు.

– జి.సిగడాం

జిల్లా క్రికెట్ జట్టు హవా



జిల్లా జట్టు క్రీడాకారులతో కోచ్ మేనేజర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏసీఏ అంతర్‌జిల్లాల అండర్–14 మల్టీడేస్ క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం జిల్లా జట్టు హవా కొనసాగిస్తోంది. వైఎస్సార్ కడప జిల్లా వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోను మొదటి ఇన్నింగ్స్‌లో కీలకమైన ఆధిక్యాన్ని సాధించి మ్యాచ్ పాయింట్లను కాపాడుకున్న శ్రీకాకుళం జట్టు తాజాగా అనంతపురంతో జరుగుతున్న మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యాన్ని సాధించింది. మ్యాచ్ పాయింట్లను దక్కించుకుంది. జిల్లా జట్టు రాణింపు పట్ల జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్ష,కార్యదర్శులు పీవీఎస్ శాస్త్రి, హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్, మదీనా శైలానీ తదితరులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రణస్థలం మండలం చిల్లపేట రాజాం గ్రామానికి చెందిన కొణతాల శ్యామలరావు (12) అనే విద్యార్థి విజయనగరంలోని బీసీ హాస్టల్లో చదువుతూ ఆకస్మికంగా మృతి చెందడం విచారకరమని జ్యోతిబాపూలే ఆల్ ఇండియా ఓబీసీ అసోషియేషన్ ఉత్తరాంధ్ర జనరల్ సెక్రటరీ రౌతు శంకరరావు అన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాలల హక్కుల కమిషన్ స్పందించి సరైన న్యాయం జరిగేలా చూడాలని, బాధిత కుటుంబానికి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్



రైతు బజారులో పనిచేయని ఆర్వో ప్లాంట్



పనిచేయని ట్యాప్‌లు



అపరిశుభ్రంగా ఉన్న శుద్ధజలం సింక్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రైతులు, కొనుగోలుదారుల దాహార్తిని తీర్చేందుకు రైతు బజారులో గత ప్రభుత్వ హయాంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్లాంట్ పనిచేసినంత కాలం రైతులు, వ్యాపారులు చక్కగా తాగునీరు పట్టుకుని దాహార్తి తీర్చుకున్నారు. అయితే కొన్ని రోజుల క్రితం ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురై మూలకు చేరింది. దీంతో మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం మానేశారు. దీంతో అక్కడ ఏర్పాటు చేసిన ట్యాప్‌లు సైతం పాడైపోయాయి. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్లాంట్ బాగుచేయాలని వ్యాపారులు, కొనుగోలుదారులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



రణస్థలం: పాతర్లపల్లిలో నాగుల చవితి వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్



ఎచ్చెర్ల: మురపాకలో పూజలు చేస్తున్న గ్రామస్తులు



శ్రీకాకుళం కల్చరల్: పుట్టల వద్ద పూజలు చేస్తున్న దృశ్యం



శ్రీకాకుళం కల్చరల్: 80 అడుగుల రోడ్డులో పూజలు చేస్తున్న మహిళ



జిల్లా పరిషత్ వద్ద నాగుపాముకు నమస్కరిస్తున్న చిన్నారులు



జిల్లా పరిషత్ వద్ద పుట్టలో వేసిన గుడ్లను తీస్తున్న దృశ్యం



జి.సిగడాం: పెంట గ్రామంలో కుటుంబాలతో భక్తులు

ఎచ్చెర్ల, శ్రీకాకుళం నియోజకవర్గాల ప్రజలు నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి నువ్వులతో చేసిన చిమ్మి, కోడిగుడ్లను పుట్టలో వేసి, పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండాలని, నిత్యం పొలం పనులు చేసే రైతులు, రైతు కూలీలకు ఎలాంటి హాని తలపెట్టవద్దని నాగ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. చవితి రోజున పంట పొలాలను సందర్శిస్తే మంచిదనే సంప్రదాయాన్ని రైతు కుటుంబాలు పాటించాయి.

– సాక్షి నెట్‌వర్క్